సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

సదుపాయాల కల్పనకు చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సృజన - ట్రిపుల్ ఐటి డిఎం అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జగన్నాథగట్టు సమీపంలో ఉన్న ట్రిపుల్ ఐటి విద్యా సంస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ట్రిపుల్ ఐటి డిఎం అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రధాన రహదారి నుంచి ట్రిపుల్ ఐటి డిఎం సంస్థ వరకు నిర్మిస్తున్న రహదారిని డిసెంబర్ 15లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అవసరమైన తాగు నీటికి సంబంధించి శాశ్వతమైన నీటి సరఫరా ఏర్పాటు చేసేంత వరకు తాత్కాలికంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో బోర్ వెల్స్ తవ్వించాలని సూచించారు. అందుకు అవసరమైన అనుమతులను తాము మంజూరు చేస్తామని తెలిపారు. కళాశాల మీదుగా వెళ్లే హెచ్‌టి విద్యుత్ లైన్లు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాల ప్రహరీ నిర్మాణానికి సంబంధించి మిజోరంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఆర్అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్నతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి ప్రహరీ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అప్రోచ్ రోడ్డు వెంట వీధి లైట్ల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జెసి నారపు రెడ్డి మౌర్య, డిఆర్‌ఒ కె.మధుసూదన రావు, ట్రిపుల్ ఐటి డిఎం డైరెక్టర్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తి, కన్సల్టెంట్ ఇంజినీర్ విజయానంద్, ఆర్అండ్‌బి ఎస్ఇ నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, జూనియర్ ఇంజినీర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

హామీలు గాలికే..!

- పాదయాత్రలో హామీల వర్షం
- అధికారంలోకి రాగానే విస్మరింపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజా సంకల్ప యాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. ఆ సందర్భంగా జిల్లాకు పలు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే ఆ హామీలను విస్మరించారు...

టెక్స్‌టైల్ పార్కు భూకేటాయింపుకే పరిమితం

ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో బనవాసి కేంద్రంలో 96.5 ఎకరాలకు పైగా టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించారు. ఇప్పటివరకు టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయి. చేనేత సహకార సొసైటీ కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి తోడ్పాటు లేకపోవడంతో ఉత్సవ విగ్రహంలాగా తయారయింది.

గతిలేని గుండ్రేవుల..

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. వైసిపి ప్రభుత్వం గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

చెరువులకు నీళ్లు అంతంతే

హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఉమ్మడి జిల్లాలోని 68 చెరువులకు నీటిని నింపుతామని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 77 చెరువులకు నీటిని నింపుతున్నట్లు ఈఏడాది జూన్ 1న ఆ కార్యక్రమాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్యాపిలి మండలంలో 19 చెరువులకు నీరందాల్సి ఉండగా ఒక్క చెరువులోకే నీరు చేరాయి. మద్దికెర మండలంలో ఒక్క చెరువుకూ చుక్క నీరు రాలేదు. తుగ్గలి మండలంలో 13 చెరువుల్లో రెండింటికి అరకొరగా నీటిని విడుదల చేశారు. పత్తికొండ మండలంలో చందోళి చెరువులోకి సగం నీరు చేరగా చక్రాళ్ల, పత్తికొండ చెరువులకు చుక్కనీరు చేరలేదు.

మరిన్ని హామీల అమలు ఇలా..

- వైసిపి అధికారం చేపట్టిన నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైపులైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు.
- ఎల్ఎల్‌సిని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు.
- ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు.
- కోవెలకుంట్ల మండలంలో పర్యటిస్తున్నప్పుడు జొలదరాశి వద్ద కుందూనదిపై మినీ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీని కోసం కడప జిల్లాలోని దువ్వూరులో ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేశారు. భూసర్వే పనులు జరుగుతున్నాయి.
- కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని ఆళ్లగడ్డ పర్యటనలో హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.
- 90 శాతం పనులు పూర్తయిన పులికనుమ ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేస్తామని 1.232 టిఎంసిలు నిల్వ చేసి 26,400 ఎకరాలకు సాగు నీరు అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించ తలపెట్టిన ప్రాంతం

రాఘవేంద్రుని సన్నిధిలో జిల్లా జడ్జి శ్రీనివాస రావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని కర్నూలు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాస రావు గురువారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు.

పూజలు చేస్తున్న శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు

ఘనంగా జాతీయ న్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు లీగల్

కర్నూలు నగరంలోని జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్, సుశీల నేత్రాలయ డాక్టర్ సుధాకర్, ఎన్‌జిఒ, పారా లీగల్ వాలంటీర్ గంగాధర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఎన్.శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రతేడాది నవంబర్ 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు చట్టపరమైన అవకాశాలు అందించేందుకు తోడ్పడుతుందని చెప్పారు. ఈ సంస్థ ద్వారా మొత్తం 4 జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించామని, 91,014 కేసులను పరిష్కరించామని తెలిపారు. కర్నూలు లీగల్ సర్వీసెస్ కేసుల పరిష్కారంలో 1వ ర్యాంకును సాధించిందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.ప్రతిభా దేవి, ఎసిబి కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి బి.సునీత, సెషన్స్ కోర్ట్ ఫర్ మహిళలపై కేసుల విచారణ, ఏడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.భూపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లేశ్వరి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోత్స్న దేవి, స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (ఎక్సైజ్) పటాన్ షియాజ్ ఖాన్, మొబైల్ కోర్టు జడ్జి కల్యాణి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు టి.సర్కార్, టి.నాగభూషణం నాయుడు, చక్రపాణి పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ నీరిచ్చే వరకు పోరాటం

- 30 గంటల నిరవధిక దీక్షకు కోట్ల సుజాతమ్మ, గౌస్‌దేశాయి సంఘీభావం
- అధికారులు, ప్రజాప్రతినిధుల హామీతో దీక్ష విరమణ

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి ఎకరాకూ సాగు నీరిచ్చే వరకు ఐక్య పోరాటం చేస్తామని వక్తలు పేర్కొన్నారు. హంద్రీనీవా నుంచి గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరివ్వాలని, మండలంలోని చెరువులన్నింటికీ హంద్రీ ద్వారా నీటిని నింపాలని రైతు సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో చేపట్టిన 30 గంటల నిరవధిక దీక్షకు గురువారం టిడిపి, సిపిఎం జిల్లా నాయకులు, పలువురు ఎంపిటిసిలు సర్పంచులు మద్దతు తెలిపారు. నిరవధిక దీక్షకు మద్దతుగా టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, ఎంపిటిసిలు విజయ గౌడ్, తపాల శ్రీనివాసులు, వెలమకూరు సర్పంచి భాస్కర్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవనకొండ మండలం తీవ్ర కరువు ప్రాంతమని, కరువు పరిష్కారంగా హంద్రీనీవా వచ్చిందని తెలిపారు. 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికీ నిర్దిష్టంగా ప్రభుత్వం సాగునీరు ఇవ్వలేకపోతోందని చెప్పారు. పంట కాలువలు తవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. అనేక మంది ప్రజలకు, గ్రామాలకు ఉపయోగకరంగా ఉండే గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేస్తే దాదాపు 10, 12 గ్రామాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కరువు ప్రకటిస్తున్నా రైతులను నిర్దిష్టంగా ఆదుకునే చర్యలు లేవని తెలిపారు. ప్రతి ఎకరాకూ నీరిచ్చే అవకాశం ఉందని, సాగునీటిపై పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మండలంలోని నేలతలమరి, గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, బేతపల్లి, బండపల్లి, చెల్లెల చెలిమిల, కోటకొండ గ్రామాల చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటిని మళ్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు పలు దఫాలుగా మంత్రి, కలెక్టర్, సాగునీటి జిల్లా స్థాయి అధికారులకు వినతి పత్రాలు అందజేశారని తెలిపారు. రైతుల సాగునీటి సమస్య, చెరువులకు నీళ్లు మళ్లించే అంశంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతులతో కలిసి ఉద్యమిస్తామని, రైతులు చేసే ఉద్యమాలకు తమ పూర్తి సహకారం, సంఘీభావం ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు, రైతు సంఘాలు, సిపిఎం చేసే ఆందోళనలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రత్యక్షంగా పాల్గొంటామని వారు పేర్కొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఎంపిడిఒ కార్యాలయాన్నిముట్టడించిన రైతులు

సాగునీటి కోసం 30 గంటల నిరవధిక దీక్ష చేస్తున్నా వైసిపి ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సబబు కాదని, రైతుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడం మంచిది కాదని ఎంపిడిఒ కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా రైతు సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడించారు. సాగునీరు, చెరువులకు నీళ్లు మళ్లించాలని రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. సాగునీటి కోసం తీర్మానం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఎంపిపి లక్ష్మీదేవి, ఎంపిడిఒ గౌరీ దేవి, డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనం, హంద్రీ నీవా జెఇ లక్ష్మీనారాయణ, ఎంపిటిసిలు, సర్పంచులు సమస్య పరిష్కారానికి సహకరిస్తామని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేస్తూ ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు. దీక్ష విరమించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల హామీ మేరకు దీక్ష శిబిరం వద్దకు చేరుకొని నిరవధిక దీక్ష చేస్తున్న రైతులు, రైతు, వ్యకాస నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, పత్తికొండ నాయకులు దస్తగిరి, నాయకులు శ్రీనివాసులు, వీరేంద్ర, సుధాకర్, లింగన్న, నాగేష్, యూసుఫ్, మహేంద్ర, నాగేంద్ర, రాయుడు, లక్ష్మి రెడ్డి, గుండ్లకొండ, గుడిమరాళ్ల, బంటుపల్లి, కోటకొండ రైతులు వెంకటస్వామి, వెంకటరాముడు, కృష్ణ, కౌలుట్ల, శేషిరెడ్డి, శ్రీనివాసులు, దేవన్న, బయప్ప, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, స్వాములు, మార్కండేయులు, గుడిమిరాళ్ల సర్పంచి శేషి రెడ్డి, వెలమకూరు సర్పంచి భాస్కర్, చెల్లెల చెలిమల, బేతపల్లి సర్పంచులు చిన్న రామప్ప, మహేశ్వర్ రెడ్డి సంఘీభావంగా పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న కోట్ల సుజాతమ్మ

టీకాలపై నిర్లక్ష్యం వద్దు

- నేడు వరల్డ్ ఇమ్యునైజేషన్ డే
- కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ నియోనటాలజిస్ట్ డాక్టర్ హెచ్‌ఎ.నవీద్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

చిన్న పిల్లల్లో టీకాలు (వ్యాక్సిన్లు) చాలా కీలకమైన పాత్ర వహిస్తాయని, రోగనిరోధక శక్తి పెంచడానికి ఉపయోగ పడతాయని, టీకాల పట్ల నిర్లక్ష్యం వద్దని కర్నూలు కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ నియోనటాలజిస్ట్ డాక్టర్ హెచ్‌ఎ.నవీద్ తెలిపారు. నేడు శుక్రవారం వరల్డ్ ఇమ్యునైజేషన్ డేని పురస్కరించుకుని ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల ఈ టీకాల మీద అనేక అపోహలు ఉన్నాయన్నారు. టీకాలు వేయడం ద్వారా చిన్నపిల్లలు బలహీనపడతారని, వ్యాధులు వ్యాప్తి చెందుతాయనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. టీకాలు వేయడం ద్వారా చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, పోలియో, ఇతర అంటు వ్యాధులు రాకుండా ఉంటారని చెప్పారు. ప్రజల్లో ఈ టీకాల గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం నవంబర్ 10న వరల్డ్ ఇమ్యునైజేషన్ డేని నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలకి దగ్గు, జలుబు ఉంటే టీకాలు వేయడానికి చింతించవద్దని, పిల్లలు, సమాజం ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి బిడ్డకు టీకాలు వేసేలా ప్రోత్సహించాలని తెలిపారు.

వృద్ధులను, నిరుపేదలను ఆదుకోవాలి

- ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులను, నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు సామాజిక సేవా దక్పథంతో ముందుకు రావలసిన అవసరం ఉందని ప్రముఖ సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. గురువారం కర్నూల్ నగరంలోని బుధవారపేటలో ఉన్న ఆదరణ డే కేర్ సెంటర్‌లోని నిరాశ్రయులకు ఆయన నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ముఖ్యంగా వృద్ధులకు సముచిత గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో కూడా ఆదరణ డే కేర్ సెంటర్‌తో పాటు పలు అనాథ, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించానని, భవిష్యత్తులో కూడా తన సహకారం ఉంటుందని తెలిపారు .ఆదరణ డే కేర్ సెంటర్లోని వృద్ధులకు ఆరోగ్య సమస్యలు వస్తే సహాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆదరణ డే కేర్ సెంటర్ నిర్వాహకుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

ప్రజారక్షణ భేరి బహిరంగ సభ జయప్రదం చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - పత్తికొండ

ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కోరారు. గురువారం పత్తికొండ పట్టణంలోని కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి భవనంలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభ గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే సిఎం జగన్మోహన్ రెడ్డి నోరు మెదపడం లేదని విమర్శించారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండు ముఖం పట్టి తీవ్ర నష్టం వచ్చిందన్నారు. ప్రజా సమస్యల కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రను కొనసాగిస్తుందని, ఈ నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజా సంఘాలు పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, కమిటీ సభ్యులు దస్తగిరి, వెంకటేశ్వర రెడ్డి, సిద్దయ్య గౌడ్, రమేషు, మధు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. **తుగ్గలి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, సిఐటియు నాయకులు రంగస్వామి, రైతు సంఘం నాయకులు కొండారెడ్డి అన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను తుగ్గలిలో వారు విడుదల చేశారు. సిఐటియు నాయకులు ఈశ్వరప్ప, ఆనంద్, సూరి, దావీదు, వ్యకాసం నాయకులు పాల్గొన్నారు. **గూడూరు :** ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను గూడూరులో సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జె.మోహన్, మండల కమిటీ సభ్యులు రాజశేఖర్, రవి, కోటయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడారు. సిఐటియు కార్మికులు గోకారి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

లారీ స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన గురువారం కర్నూలు మండలం గార్గేయపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలం దేవనూరుకు చెందిన బోయ వెంకటకృష్ణ (30), బోయ సుదర్శన్ (20) మధ్యాహ్నం కర్నూల్‌కు వ్యక్తిగత పనుల మీద స్కూటీ బైక్‌పై బయలుదేరారు. కర్నూలు మండలం గార్గేయపురం బిసి కాలనీ వద్ద మరియా నిలయం ఇంగ్లీష్ మీడియం పాఠశాల సమీపంలోకి రాగానే నందికొట్కూరు నుంచి కర్నూలు వైపు వెళుతున్న లారీ ముందు వైపు వెళుతున్న టివిఎస్ స్టార్ సిటీ మోటర్ బైక్‌ను ఢీకొంది. దీంతో బోయ వెంకటకృష్ణ, బోయ సుదర్శన్‌లు అదుపుతప్పి లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సుదర్శన్ పాలిష్ బండల కటింగ్ పని చేస్తున్నాడు. సురేష్‌ను పట్టణంలో వదిలి పెట్టేందుకు బోయ వెంకటకృష్ణ వెంట వచ్చినట్లు తెలిసింది. వెంకటకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుదర్శన్‌కు పెళ్లి కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతి చెందిన వెంకట కృష్ణ, సుదర్శన్

రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి : ఎస్‌డిపిఐ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాబోవు సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని ఎస్‌డిపిఐ రాష్ట్ర అధ్యక్షులు హఫీజ్ అతావుల్లా ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బిస్మిల్లా ఫంక్షన్ హాల్లో కర్నూల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ బిజెపి మత సామ్రాజ్యాన్ని స్థాపించే యత్నం చేస్తుందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించేందుకు ఎన్నికలు అత్యంత కీలకమన్నారు. దేశ హితం కోసం ఎస్‌డిపిఐ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు లింకన్ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం అభివృద్ధికి పాటుపడే ఎస్‌డిపిఐతో ప్రజలు కలిసి రావాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జహంగీర్ అహ్మద్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎస్‌డిపిఐ సన్నద్ధమవుతుందన్నారు. కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్ మావియా మాట్లాడుతూ బూత్ స్థాయి కమిటీలు తమ తమ కార్యాచరణలో నిమగ్నం కావాలన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అష్ఫక్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు హఫీజ్ అతావుల్లా ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు కే బాబురావు

బూత్ కమిటీలను పూర్తి చేయాలి

- డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలను పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక డిసిసి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర అనంతరం దేశంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాలలో జరుగు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఏర్పడబోతున్నాయని అభిప్రాయపడ్డారు. పార్టీని అభివృద్ధి చేసి వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు జాన్ విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ ఎన్‌సి బజారన్న, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యు సత్యరాజు, డిసిసి కార్యదర్శులు లాజరస్, ఎజాస్, రియాజ్, మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖాద్రి, నాయకులు బి.సుబ్రహ్మణ్యం, విక్టర్, జోసఫ్, నోయల్, కొత్తపేట మున్న, ఎస్.మాలిక్, ఉండవల్లి వెంకటన్న, జయకుమార్, దేవకుమార్, అబ్దుల్, జిలాని, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై పురోగతి సాధించాలి

ప్రజాశక్తి - సి బెళగల్ : ఇళ్ల నిర్మాణాలపై పురోగతి సాధించాలని పిడి సిద్దలింగమూర్తి సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం బెళగల్‌లో హౌసింగ్ ఏఈ సుమంత్ సమక్షంలో సిబ్బందితో సమీక్షించి మాట్లాడారు. పిడి మాట్లాడుతూ జగనన్న ఇళ్ళు అసంపూర్తిగా ఉన్నాయని, లక్ష్యాలను సాధించాలంటే పనులను ముమ్మరం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రంగన్న, ఇంజినీర్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిడి సిద్దలింగమూర్తి

ప్రజల వద్దకే పాలన : ఎమ్మెల్యే

- మండిగిరిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సచివాలయ వ్యవస్థ ద్వారా, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సేవలందిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మండిగిరి సచివాలయ పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వాలంటీర్లకు సూచించారు. వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్డు, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యం తెలుసుకుంటూ, సమస్యలు తెలుసుకుంటూ ప్రతి గడపకూ తిరిగారు. సచివాలయ నిధులు రూ.21.80 లక్షలతో డ్రెయినేజీ, కాలువలు, సిసి రోడ్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. మండిగిరిలో 800 పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఎంపిడిఒ గీతావాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగమల్లయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైసిపి సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, మండిగిరి శేషిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కల్లుబోతుల సురేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం గోనెగండ్లలో 9వ రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. సచివాలయం-1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధమేనని, ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు మద్దతిచ్చి రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని కోరారు. వైసిపి నాయకులు టి.బందే నవాజ్, ఎస్‌వి.మస్తాన్, భాస్కర్ రెడ్డి, దౌలాబాబు నాయుడు, గోవిందు, పూజారి రంగస్వామి, బగిలి ఉస్మాన్, రఫీ, కామిర్ల పద్మనాభం పాల్గొన్నారు.

సంక్షేమ వివరాలను వివరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

ఆదోనిలో 98 శాతం అభివృద్ధి : శాంత

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో 98 శాతం అభివృద్ధి చేసినట్లు మున్సిపల్ ఛైర్పర్సన్ శాంత, వైసిపి నాయకులు జయ మనోజ్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 10వ వార్డు సచివాలయంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న'ను ప్రారంభించారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రజలకు ఎంతవరకు సంక్షేమ పథకాలు అందాయని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వానికి, వైసిపి ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. 98 శాతం పనులు పూర్తి చేసి ఒక్కో వార్డులో రూ.11 కోట్ల నుంచి రూ.20 కోట్ల దాకా ఖర్చు చేశామన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు, గృహ సారథులు, కన్వీనర్లు, జెసిఎస్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, జెసిఎస్ కన్వీనర్ మధుసూదన్ శర్మ, మంజునాథ్ స్వామి, సర్దార్ మలేకర్, గోవిందు, జక్కల్, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎంఎంఎ.గౌస్ ఉన్నారు.

సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న నాయకులు

అవినీతిరహిత పాలనే లక్ష్యం

సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసి అవినీతి రహిత పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ ఛైర్పర్సన్ శాంత, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. ఆదోనిలోని 13వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, వార్డు ఇన్‌ఛార్జీ కిట్టు, కౌన్సిలర్లు వసీం, గంగాధర్, రామకృష్ణ, చిన్న గోవిందు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ దేవదాస్, కోదండ, నిజాం, వైపి.రహీం, బ్రహ్మ, సన్నీ, మంజు రెడ్డి, ఈశ్వర్, చిరు పాల్గొన్నారు.

ఆగని వలసలు...

- పంటలు ఎండిపోవడంతో పనుల్లేక పట్టణాలకు వెళ్తున్న కూలీలు, రైతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

జిల్లాలో వలసలు ఆగడం లేదు. ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవలేదు. పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పనుల్లేక కూలీలూ వలసలు వెళ్తున్నారు. నివారించాల్సిన అధికారులు, పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పట్టణాలకు వలస వెళ్తున్న కూలీలు

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈఏడాది మొదటి నుంచీ వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వచ్చిన అరకొర వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో అప్పో, సప్పో చేసి రైతులు పంటలను సాగు చేశారు. పంటలు విత్తినప్పటి నుంచి వర్షాలు కురవలేదు. పంటలు ఎండిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు అల్లాడుతున్నారు. పంటలకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు కుంగిపోతున్నారు. గ్రామాల్లో సాటి రైతుల వద్ద పరువు పోగొట్టుకోకుండా ఉండాలని దసరా పండగ ముగించుకుని పట్టణాల్లో పనులు చేసుకోవడానికి రైతులు, వ్యవసాయ కూలీలు సిద్ధమయ్యారు. మండలంలోని నేమకల్లు, మజరా గ్రామమైన సంగాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు వాహనాలను బాడుగకు తీసుకొని గృహలకు తాళాలు వేసి వంట సామగ్రి, బట్టలు సర్దుకొని వలస వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మొక్కజొన్న, మిరప, పత్తి పంటలు బాగా ఉన్నాయని, అక్కడ కూలి పనులు చేసుకోవడానికి వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. 'మేము సాగు చేసిన పంటలన్నీ వర్షాల్లేక ఎండిపోయాయి. వాటి కోసం అప్పులు చేసుకున్నాం. ఆ అప్పులు తీర్చడానికి, మా కడుపులు నింపుకోవడానికి, జీవనం కొనసాగించడానికి వలస వెళ్లక తప్పడం లేదు' అని తీవ్ర మనోవేదన వ్యక్తం చేశారు. రైతులు, కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం ఏ చర్యలూ చేపట్టకపోవడం శోచనీయం. ప్రతేడాది పంటల సాగుకు చేసిన అప్పులే వడ్డీలకు వడ్డీ ఎక్కువై కట్టలేకపోతున్నామని, ఈఏడాదైనా పంటలు బాగా వస్తే అప్పులు తీర్చుదామని రైతులు భావించారు. ఈఏడాది కూడా వర్షాల్లేక, కరువును జయించలేక ఎక్కడికో వెళ్లి బతకాల్సిన దుస్థితి నెలకొంది. ఈ దుర్భర పరిస్థితి తమకు ఎప్పుడు పోతుందోనని వ్యవసాయ కూలీలు వాపోయారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతులు జీవితాలు మారడం లేదు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో మరిన్నీ వలసలు పెరిగే అవకాశం ఉందని గ్రామాల్లోని ప్రజలే చర్చించుకుంటున్నారు. తీవ్ర కరువుతో అల్లాడుతున్న రైతులకు, వ్యవసాయ కూలీలకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వలసలకు తావు లేకుండా పనులు కల్పిస్తాం

- ఎంపిడిఒ సివి.కొండయ్య

మండలంలో ఏ గ్రామంలోనైనా సరే పంటలు ఎండిపోయి వలసలు పోయే వారికి అదనంగా ఉపాధి పనులను కల్పిస్తాం. ఏ ఒక్కరూ వలసలు వెళ్లడానికి తావు లేకుండా చూసుకుంటాం. ఇప్పటివరకు అధికారికంగా వలసలు మా దృష్టికి రాలేదు.

వలసలు వెళ్లకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిది

- కెపి నారాయణ స్వామి, సిపిఎం నాయకులు

వర్షాభావ పరిస్థితులతో పంటలు చేతికి రాక పక్క రాష్ట్రాలకు రైతులందరూ వలస వెళ్లి అక్కడ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ వలసలను ఆపాలంటే తక్షణమే ప్రభుత్వం కరువు మండలాల్లో అదనపు ఉపాధి పనులు కల్పించి, వెంటనే వేతనాలు కూడా చెల్లించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. అప్పుడే వలసలు ఆగుతాయి.

కరువుతో వలస బాట

- ఖాళీ అవుతున్న గ్రామాలు..

ప్రజాశక్తి - దేవనకొండ

ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు వలస బాట పట్టారు. మండలంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం గుడిమిరాళ్ల, పాలకుర్తి, దేవనకొండ గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు తెలంగాణ ప్రాంతానికి పత్తి తీసేందుకు వలస వెళ్లారు. గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మండలంలో పత్తి, వేరుశనగ, ఆముదం, టమోటా తదితర పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. వర్షాలు కురవకపోవడంతో పంటలు దెబ్బతిని దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయారు. పంట దిగుబడులకు పెట్టిన పెట్టుబడులు సైతం రాక తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ పనులు ముగిసిపోవడంతో, పంటల పెట్టుబడులు రాకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు గుంటూరు, తెలంగాణ, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. పాఠశాలల్లో చదువుకునే పిల్లలను సైతం తమ వెంట తీసుకొని పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న ఉపాధి పనులు గ్రామాల్లో వేగవంతం చేసి వలసలు నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

వలస వెళ్తున్న గుడిమిరాళ్ల కూలీలు

కొత్త అభ్యర్థుల అన్వేషణలో 'వైసిపి'

- ఆశావహుల్లో పెరుగుతున్న ఉత్సాహం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు అసెంబ్లీ బరిలో కొత్త అభ్యర్థులను వైసిపి అధిష్టానం అన్వేషిస్తుండడంతో టికెట్ ఆశిస్తున్న ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. గత నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎమ్మిగనూరు పర్యటనలో భాగంగా వైసిపి నాయకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆలూరుకు చెందిన నాయకులు ఈ దఫా కూడా మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు టికెట్ ఇస్తే ముచ్చటగా మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ కానుకగా ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ దఫా గుమ్మనూరును ఎంపీ బరిలో నిలుపుతామని తెలిపినట్లు సమాచారం. అంతేకాక జయరామ్‌ను ఎంపీ బరిలో నిలిపేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో జగన్ చెప్పినట్లు తెలిసింది. ఆయనకు స్థాన చలనం ఉన్నందునే కొత్త అభ్యర్థుల అన్వేషణలో భాగంగానే పత్తికొండ సమితి మాజీ అధ్యక్షులు వెంకటప్ప నాయుడు కుమార్తె, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మను పార్టీలో చేర్చుకున్నారు. ఆమెకు నియోజకవర్గంలో తిరిగేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో వైసిపి జిల్లా మహిళ అధ్యక్షులుగా ఆమెను నియమించారు. ఈ పదవి ద్వారా విస్తృతంగా పర్యటించి ప్రజాబలం పెంచుకోవాలని సూచించినట్లు తెలిసింది. చిప్పగిరి జడ్‌పిటిసి గత మూడేళ్లుగా మంత్రికి దూరమై స్వంత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన కూడా జిల్లాలో కొంతమంది ఎమ్మెల్యేల సహకారంతో ముందుకు వెళ్తున్నారు. వైసిపి అధిష్టానం గతంలో పోటీ చేసి ఓడిపోయిన వీరభద్రగౌడ్‌ను కూడా పార్టీలోకి తెచ్చేందుకు పావులు కదుపుతోంది. ఆయనను బరిలో దింపితే గెలిచే అవకాశాలు ఉంటాయని సర్వేలో వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆలూరు అసెంబ్లీ బరిలో నిలిచేందుకు కురువ సామాజిక వర్గానికి చెందిన బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ కూడా ఆశిస్తున్నారు. ఈమె స్వస్థలం నియోజకవర్గంలోని మొలగవల్లి గ్రామం కావడంతో ఇటీవల కురువల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆమె కూడా ఏ పార్టీ టికెట్ కేటాయించినా పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. వీరితో పాటు నియోజకవర్గంలో బెంగళూరు, హైదరాబాదు నగరాల్లో ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా స్థిరపడిన వారు కూడా టికెట్ ఆశిస్తున్నారు.

దేవనకొండ మండలం నుంచి సీనియర్ నాయకులు కొత్తకాపు మధుసూదన్ రెడ్డి కూడా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనతో పాటు వైసిపి ముఖ్య నాయకులతో సంబంధాలు ఉన్న తెర్నేకల్ సురేంద్రరెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆయన కూడా మంత్రి గుమ్మనూరు జయరామ్ ఎంపీ బరిలో నిలిస్తే తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆలూరు అసెంబ్లీ బరిలో మాత్రం వైసిపి అధిష్టానం బీసీ వర్గం నుంచి పోటీలో నిలపాలని చూస్తున్నట్లు సమాచారం. వైసిపి అధిష్టానం ఆలోచనలతో పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్న అభ్యర్థులతో ఆశలు పెరుగుతున్నాయి.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, భవిష్యత్తు మారాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. గురువారం మండలంలోని గుమ్మనూరు, బంటనహాల్, ఏరూరు, డేగలపాడు గ్రామాల్లో మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోట్ల సుజాతమ్మ హాజరై మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వర్షాల్లేక పంటలు ఎండి పెట్టుబడులు రాక రైతులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అవడాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని, కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు సుజాతమ్మకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి మేకల రవి యాదవ్, సర్పంచి సుశీలమ్మ, సురేష్, టిడిపి మాజీ కన్వీనర్ కిష్టప్ప, సర్పంచి పురుషోత్తం, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, అంపయ్య, సోమశేఖర్ నాయుడు, నాగిరెడ్డి, ఉమా కాంత్ స్వామి, మేకల రామాంజిని, హరినాథ్ పాల్గొన్నారు.

మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సుజాతమ్మ

పేదలకు అండగా ఉండే పార్టీ టిడిపినే

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం టిడిపి పుట్టిందని, పేదలకు అండగా ఉండే పార్టీ ఒక్క టిడిపి మాత్రమేనని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మాధవరం తండా గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. అంతకుముందు గ్రామం చేరుకున్న ఆయన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ టిడిపి రానున్న రోజుల్లో ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, గ్రామ నాయకులు తిరుమల నాయక్, నారాయణ నాయక్, లింగప్ప నాయక్, గణపతి నాయక్, శీను నాయక్, లోక నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల్లో స్పందన

- కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకే వార్డు వారీగా స్పందన నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. గురువారం క్రాంతి నగర్ 24వ వార్డు సచివాలయంలో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి ప్రతి గురువారం ఆయా సచివాలయాల్లో నిర్వహించే స్పందనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పందనలో హౌస్ సైట్, హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్, వాటర్ సప్లయి, రోడ్ నిర్మాణం, స్ట్రీట్ లైట్, డ్రెయినేజీ సమస్యలపై 33 అర్జీలను స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. అర్జీలు స్వీకరించడం కాదని, సత్వరమే పరిష్కారం చూపాలని పలువురు కోరారు. వార్డు ఇన్‌ఛార్జీ జికె.రాజు, సిద్ధ మల్లికార్జున, సంజీవ ఉన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.50/2023

బి.తిమ్మారెడ్డి తండ్రి భీమ్‌రెడ్డి,
ఇంటి.నెం.86/366-6ఎ,
డాక్టర్స్‌కాలనీ, కర్నూలు సిటి. మొబైల్
నెం.9391733328. ... అర్జీదారు

-వర్సెస్-

యం.గౌరన్న మరియు 15 మంది ఇతరులు
... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ మరియు కల్లూరు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు ఐ.పిలో అర్జీదారు అయిన బి.తిమ్మారెడ్డి తండ్రి భీమ్‌రెడ్డి, ఇంటి.నెం.86/366-6ఎ, డాక్టర్స్‌కాలనీ, కర్నూలు. మొబైల్ నెం.9391733328 అను నతుడు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దివాళా అర్జీదాఖలు చేసినాడు. ఇందులో ఎవరకైన ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 4-12-2023 వ తేది 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 4-12-2023

పి.శివసుధర్శన్,
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

ప్రజలతో మాట్లాడుతున్న మారయ్య, నాయకులు

వైసిపి పాలనలో అన్ని తరగతులకూ లబ్ధి : వైసిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని తరగతులకూ ఏదో ఒక రకంగా ఆర్థిక లబ్ధి చేకూర్చారని వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు తెలిపారు. గురువారం చిప్పగిరి సచివాలయ కార్యాలయంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి'ని సర్పంచి గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లోనూ మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనంతగా వైద్యం, విద్యకు అధిక నిధులు వెచ్చించారని చెప్పారు. సచివాలయ కన్వీనర్ ధర్మేంద్ర, బూత్ కన్వీనర్ రాజన్న, ఎంపిటిసిలు సుంకన్న, భీమలింగ, వైసిపి నాయకులు లింగన్న, లాలు స్వామి, మురళీ పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా లబ్ధి

- వైసిపి ఇన్‌ఛార్జీ నారాయణస్వామి

ప్రజాశక్తి - హాలహర్వి

అవినీతికి తావు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. గురువారం హాలహర్వి గ్రామ సచివాలయంలో నారాయణ స్వామి ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న', 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ముందుగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులతో కలిసి హాలహర్వి సచివాలయం పరిధిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంత లబ్ధి పొందింది తెలియజేసేలా 'సంక్షేమ పథకం బోర్డు'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడారు. గ్రామ సచివాలయం పరిధిలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, మండల జెసిఎస్ కన్వీనర్ రంజిత్ కుమార్ పాల్గొన్నారు. **ఆస్పరి :** రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం జగన్మోహన్ రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి వైసిపి నాయకుడు, కార్యకర్తపై ఉందని జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు. గురువారం ఆస్పరి సచివాలయం-1లో 'ఎపికి మళ్లీ జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. సంక్షేమ పథకాల సమాచార బోర్డును సర్పంచి రాధమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇఒఆర్‌డి నరసింహారెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఎంత మందికి, ఎంతమేర లబ్ధి జరిగిందో సంక్షేమ సమాచార బోర్డులో ఉన్న వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి నాయకులు నిర్వహిస్తున్న అబద్దపు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. నాలుగున్నర ఏళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి 2024లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. సచివాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైసిపి జెండాను మండల కన్వీనర్ పెద్దయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఉప సర్పంచి వెంకటేశ్వరమ్మ, వైసిపి నాయకులు రామాంజినేయులు, ఎంపిడిఒ రాణెమ్మ, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సొసైటీ సిఇఒ అశోక్, పంచాయతీ సెక్రటరీ జంప్ల నాయక్ పాల్గొన్నారు. **మంత్రాలయం**లోని సచివాలయం-1లో ఎమ్మెల్యే వై బాలనాగరెడ్డి ఆదేశాల మేరకు 'ఎపికి జగనే సిఎం ఎందుకు కావాలి' నిర్వహించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదురుగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఇఒఆర్‌డి ప్రభావతి, ఎపిఒ జయశ్రీ, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, మాజీ సర్పంచి గౌర్కల్ కృష్ణ స్వామి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, కురువ మల్లికార్జున, భాస్కర్, రామాంజనేయులు పాల్గొన్నారు.



హాలహర్విలో మాట్లాడుతున్న నారాయణస్వామి

ఆస్పరిలో మాట్లాడుతున్న జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర

మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.97/2020

ఆంధ్రబ్యాంక్,
రెప్రజెంటెడ్ బై ఇట్స్ సీనియర్ మేనేజర్,
వెంకటరమణకాలనీ బ్రాంచ్, కర్నూలు సిటి.
... వాది

-ఎదురి-

యం/యస్.యస్.యస్.కంప్యూటర్స్ వగైరా
... ప్రతివాదులు

1,2,3,4 ప్రతివాదులకు దావా సమన్లు

1. యం/యస్.యస్.యస్.కంప్యూటర్స్,కర్నూలు, రెప్రజెంటెడ్ బై ఇట్స్ పార్ట్‌నర్ కె.రాజరమణ మరియు శ్రీమతి.బి.శివ నాగ సౌమ్య దీప్తి, డోర్.నెం.40/421-31,షాపు.నెం.1, భాస్కర్‌నగర్, కర్నూలు.
2. కె.రాజరమణ తండ్రి కె.వెంకటేశ్వరరావు, ఫ్లాటు.నెం.501, సమేర హిల్స్, ఛాణిక్యాపురికాలనీ, మెనేజింగ్ పార్ట్‌నర్ యం/యస్.యస్.యస్. కంప్యూటర్స్, కర్నూలు
3. బి.శివ నాగ సౌమ్య దీప్తి భర్త కె.రాజరమణ ఫ్లాటు నెం.501 సమేర హిల్స్, ఛాణిక్యాపురికాలనీ, మెనేజింగ్ పార్ట్‌నర్ యం/యస్.యస్.యస్. కంప్యూటర్స్, కర్నూలు
4. అకేపోగు దానియేలు తండ్రి లేటు ఎ.బాలసుందరం, ఇంటి.నెం.40/447-22-బి, గిప్సన్‌కాలనీ, కర్నూలుసిటి.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదుల నుండి దావా మొత్తం రూ.5,58,609/-లు ఇందుపైన వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2,3,4 ప్రతివాదులైన అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 27-11-2023వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

జి.యస్.విజయభాస్కర్‌రెడ్డి
యల్.హేమలత రెడ్డి
వాది పరం అడ్వకేట్లు,
కర్నూలు.

సమస్యలు పరిష్కారానికి నోచుకోనప్పుడు

సర్వసభ్య సమావేశాలెందుకు..?

- పలు శాఖల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోనప్పుడు సర్వసభ్య సమావేశాలు ఎందుకని ఎంపిటిసిలు తపాల శ్రీనివాసులు, తిమ్మప్ప, వెలమకూరు సర్పంచి భాస్కర్ ప్రశ్నించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఎంపిటిసి తపాల శ్రీనివాసులు మాట్లాడుతూ... కుంకునూరు రెవెన్యూ పరిధిలో క్రాస్ రోడ్డు వద్ద 10.79 ఎకరాల ప్రభుత్వ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టారని, ఇది రెవెన్యూ అధికారుల తప్పిదమని సభ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యకు సమాధానం చెప్పాల్సిన రెవెన్యూ అధికారులు హాజరు కాకపోవడం హాస్యాస్పదమన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నా ఆర్‌అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను కోరారు. ఎంపిడిఒ గౌరీదేవి మాట్లాడుతూ... వచ్చే సమావేశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీ విజయ్ మాట్లాడుతూ... జలజీవన్ మిషన్ కింద 20 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల పథకం ద్వారా తాగునీరందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎఒ సురేష్ బాబు మాట్లాడుతూ... ఈఏడాది ఖరీఫ్ సీజన్ కింద 74 వేల ఎకరాల్లో రైతుల పంటలు సాగు చేశారని తెలిపారు. తీవ్ర వర్షాభావంతో కరువు నెలకొనడంతో ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని చెప్పారు. కరువుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. రబీ సీజన్‌లో హంద్రీనీవా కాలువల కింద రైతులు పంటలు సాగు చేసుకోవద్దని సూచించారు. ఇరిగేషన్ ఎఇ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... హంద్రీనీవా ద్వారా డిసెంబర్ నెలాఖరు వరకు మాత్రమే నీటి విడుదల ఉంటుందని, రైతులు దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు కూడా ఈ విషయాన్ని రైతులకు తెలపాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖపరమైన అభివృద్ధి పనులు, పనితీరును వివరించారు. ఎంఇఒ తిమ్మారెడ్డి, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, ఎపిఒ కృష్ణమూర్తి, ఎపిఎం రమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీదేవి

'అన్నదాత' కింద సంవత్సరానికి రూ.20 వేలు

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

టిడిపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి ప్రతి రైతుకూ అన్నదాత పథకం కింద రూ.20 వేల సహాయం చేస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కంబదహాల్, జాలవాడి, కంబాలదిన్నె గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌ఛార్జీ బాబు రావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అందజేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో అన్ని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని విమర్శించారు. మంత్రాలయంలో మూడుసార్లు గెలిచానని గొప్పలు చెబుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి నాలుగు మైళ్ల నుంచి కంబాలదిన్నె వరకు రోడ్లు ఎలా ఉన్నాయో కనిపించడం లేదా ప్రశ్నించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి అక్రమ ఇసుక, అక్రమ మద్యంతో డబ్బులు సంపాదించుకోవడం తప్ప బాలనాగిరెడ్డి చేసిందేమీ లేదని మండిపడ్డారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఆర్‌టిఎస్ కన్వీనర్ దశరథ రాముడు, బీసీ సాధికారిక రాష్ట్ర సభ్యులు కురువ మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, తలారి అంజి, మల్దకల్, మురళీకృష్ణ, హనుమన్న, శేఖర్, ముని, హనుమంతు, ముక్కరన్న, వెంకన్న, కమ్మలదిన్నె శీను, భీమ రాయుడు, తాయన్న, నాగేంద్ర, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు

హామీలు గాలికే

- పాదయాత్రలో హామీల వర్షం - అధికారంలోకి రాగానే విస్మరింపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రజా సంకల్ప యాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. ఆ సందర్భంగా జిల్లాకు పలు హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే ఆ హామీలను విస్మరించారు...

టెక్స్టైల్ పార్కు భూకేటాయింపుకే పరిమితం

ఎమ్మిగనూరులో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని జగన్ పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో బనవాసి కేంద్రంలో 96.5 ఎకరాలకు పైగా టెక్స్టైల్ పార్కుకు కేటాయించారు. ఇప్పటివరకు టెక్స్టైల్ పార్కు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయి. చేనేత సహకార సొసైటీ కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి తోడ్పాటు లేకపోవడంతో ఉత్సవ విగ్రహం లాగా తయారయింది.

గతిలేని గుండ్రేవుల

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్ట్ను నిర్మిస్తానని హామీ జగన్ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. వైసిపి ప్రభుత్వం గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

చెరువులకు నీళ్లు అంతంతే..

హంద్రీనీవా ప్రధాన కాల్వ నుంచి ఉమ్మడి జిల్లాలోని 68 చెరువులకు నీటిని నింపుతామని జగన్ హామీ ఇచ్చారు. 77 చెరువులకు నీటిని నింపుతున్నట్లు ఈ ఏడాది జూన్1న ఆ కార్యక్రమాన్ని జగన్ ప్రారంభించారు. ప్యాపిలి మండలంలో 19 చెరువులకు నీరందాల్సి ఉండగా ఒక్క చెరువులోకే నీరు చేరాయి. మద్దికెర మండలంలో ఒక్క చెరువుకూ చుక్క నీరు రాలేదు. తుగ్గలి మండలంలో 13 చెరువుల్లో రెండింటికి అరకొరగా నీటిని విడుదల చేశారు. పత్తికొండ మండలంలో చందోళి చెరువులోకి సగం నీరు చేరగా చక్రాళ్ల, పత్తికొండ చెరువులకు చుక్కనీరు చేరలేదు.

మరిన్ని హామీల అమలు ఇలా..

- వైసిపి అధికారం చేపట్టి నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ను నిర్మిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు.
- ఎల్లెల్సీని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు.
- ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు.
- కోవెలకుంట్ల మండలంలో పర్యటిస్తున్నపుడు జొలదరాశి వద్ద కుందూనదిపై మినీ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీని కోసం కడప జిల్లాలోని దువ్వూరులో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. భూసర్వే పనులు జరుగుతున్నాయి.
- కేసీ ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని ఆళ్లగడ్డ పర్యటనలో హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.
- 90 శాతం పనులు పూర్తయిన పులికనుమ ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తి చేస్తామని 1.232 టిఎంసిలు నిల్వ చేసి 26,400 ఎకరాలకు సాగు నీరు అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు.

స్టాండింగ్ క్రాప్‌కు నీరు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రైతులు వేసుకున్న పంటలు ఎండిపోకుండా నీటి వనరుల లభ్యతను బట్టి స్టాండింగ్ క్రాప్‌కు నీరు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ, రీసర్వే, ఎంపీఎఫ్సి గోడౌన్లకు భూ కేటాయింపు, వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, హౌసింగ్, ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణం, పీఆర్, ఆర్డీ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ - వేజ్ జనరేషన్, స్వామిత్ర, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టరు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోకుండా సాగునీటిని అందించేందుకు వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పటిష్ట ప్రణాళిక రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రబీ సీజన్లో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు సిద్ధంగా వుంచుకొని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడో దశ కింద 150 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే పనులు ప్రభుత్వం నిర్దేశించిన గడువు డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో డ్రోన్ ఫ్లై, ఓఆర్ఐ, బౌండరీ కన్ఫర్మేషన్, గ్రౌండ్ వాల్యుయేషన్, సెక్షన్ 13 నోటిఫికేషన్, తదితరాలలో వారం వారం ప్రగతి సాధించాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలన్నారు. జనవరి 31 నాటికి రీ సర్వే జరిపిన అన్ని గ్రామాల్లో హద్దురాళ్ళు పాతే ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న లేఔట్ ల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాల పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకాల కింద చేపట్టిన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

15న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ

- జయప్రదం చేయండి
- సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - వెలుగోడు

ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గం సభ్యుడు వి.ఏసురత్నం, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి.నాగమోహన్‌లు కోరారు. గురువారం వెలుగోడు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాలలో మైనార్టీలకు భద్రత లేదన్నారు. మణిపూర్‌లో స్త్రీలను నడిరోడ్డుపై వివస్త్రలను చేసి దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు బిజెపి చూస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక కారు చౌకగా వ్యాపారస్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విజయవాడలో జరిగే బహిరంగ సభలో ప్రజలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, కిషోర్, కృష్ణ, నూరుల్లా, రహంతుల్లా, ఎర్రభాష, రామకృష్ణ, సుబ్బయ్య, ఖాదర్ బాషా, జి.భాష, భాస్కర్, కరీముల్లా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. **మిగతా 6వ పేజీలో...**

హామీలు అమలు చేసిన ఘనత వైసిపిదే

- 'పల్లెకు పోదాం 'లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విలేకరులు

చాగలమర్రి : 2014 ఎన్నికలలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేని టిడిపి ఇంటింటికి వెళ్లి ప్రజలను ఓటు అడిగే అర్హత లేదని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత వైసిపిదే అని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రి లోని ఒకటవ సచివాలయం వద్ద సర్పంచ్ తులసమ్మ అధ్యక్షతన ఏపీకి వై నీడ్ జగన్ కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పంచాయతీ కార్యనిర్వహణ అధికారి, మండల విస్తరణాధికారి సుదర్శన్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటైన జగనే రాష్ట్రానికి ఎందుకు మళ్ళీ కావాలి అనే కార్యక్రమమును ఉద్దేశించి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికలలో టిడిపి ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన, ఇవ్వని హామీలనూ అమలుపరిచారన్నారు. ప్రజలు ఆలోచించి ఎపికి జగన్ ఎంత అవసరమో గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, జిల్లా జెసిఎస్ కన్వీనర్,షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్, షేక్ మహమ్మద్ సుహేల్, మండల జేసీఎస్ కన్వీనర్ వెంకట్రామి రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ, చక్రం బీడి షబ్బీర్ మండల కో ఆప్షన్ సభ్యులు, ఇబ్రహీం, వైసీపీ నాయకులు షబ్బీర్,ఐడియా బాబు,నాగేంద్ర, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, తహసీల్దారు సుభద్రమ్మ, ఎంఈఓ అనురాధ, ఏఈ లు కొండారెడ్డి, జగ్గయ్య, షఫివుల్లా, ఏఓ రంగ నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కలెక్టరేట్ : పొన్నాపురం 1 నందు పల్లెకు పోదాం కార్యక్రమన్ని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డితో కలిసి మునిసిపల్ ఛైర్పర్సన్ మాబున్నీ సా ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీ సా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొన్నాపురం కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. అంక్కిరెడ్డి, వార్డు కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు. **గోస్పాడు గ్రామంలో** .. పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోస్పాడు మండలంకు రూ.26 కోట్ల 82 లక్షల 91 వేల సంక్షేమ పథకాలు అందాయన్నారు. **కొలిమిగుండ్ల** : ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ మొలక రాజారెడ్డి పేరం సూర్య నారాయరెడ్డి, మండల అభివృద్ధి అధికారి ప్రసాద్ రెడ్డిలు ప్రారంభించారు. సచివాలయ పరిధిలో లబ్ధిదారుల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించి అనంతరం వారు మాట్లాడారు. వెంకటసుబ్బయ్య, నరసింహుడు, ఎంకె నాయుడు, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె** : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సన్నాల జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి **మిగతా 6వ పేజీలో...**

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డప్పు, స్మశాన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కెవిపిఎస్, వ్యకాసం డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

డప్పు, స్మశాన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకురాలు కే.రంగమ్మ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.కర్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామం బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహం నుంచి సచివాలయం వరకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షర జ్ఞానం లేని డప్పు కళాకారులు పెన్షన్ ఆన్‌లైన్ చేయాలనీ ఆఫీసుల వద్దకు వస్తే వారిని అవమానించి పంపుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ధరలకు అనుకూలంగా రూ.3 వేల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలన్నారు. అర్హులైన ప్రతి డప్పు కళాకారునికి సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా పెన్షన్ ఆన్లైన్ చేయాలన్నారు. భూమిలేని డప్పు కళాకారులకు 3 ఎకరాలు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరాఇరు. కుటుంబంలో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రతి డప్పు కళాకారునికి డప్పు, గజ్జలు, డ్రస్సు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. స్మశానంలో గుంతలు తీసే కాటికాపరి బేగరులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి నెలకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లింగయ్యకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు నాగశేషులు, రాజు, మద్దిలేటి, స్మశాన కార్మికులు రాజు, ఎర్రమను, మద్దిలేటి, దేవరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు

జెండాను ఆవిష్కరిస్తున్న వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- సచివాలయాల ద్వారా గ్రామ అభివృద్ధి
- వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

గడచిన నాలుగేళ్ల వైసిపి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బానకచర్ల గ్రామంలో జరిగిన ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో రామలింగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. బానకచర్ల గ్రామంలో వైసిపి జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సచివాలయాలు ఏర్పాటు చేసి వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే పథకాలను అందించే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. రైతు భరోసా, అమ్మఒడి, నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, ఆరోగ్యశ్రీ కింద నాణ్యమైన వైద్యం, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాయని చెప్పారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడాను వివరించారు. ప్రజలకు నేరుగా అకౌంట్‌లోనే పథకాల సొమ్ము అందుతుందని పేర్కొన్నారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అందుకే మళ్ళీ జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు సింగిల్ విండో సొసైటీ ఛైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ ఎల్వి రమణారెడ్డి, డైరెక్టర్ గోపాల్, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్, మిట్టకందాల సర్పంచ్ చింతల నారాయణ, చెలిమిల్ల సర్పంచి చంద్రా రెడ్డి, నాయకులు ఓబన్న గౌడ్, ప్రభాకర్, పుల్లయ్య, బాలు నాయక్, చలమారెడ్డి, దర్గయ్య, ఎల్ల గౌడ్, యేసురత్నం, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

10న మిడుతూరులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వారంలో ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీ మిడుతూరు మండల కేంద్రం వెలుగు ఐకెపి కార్యాలయ ఆవరణలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ మిడుతూరు మండల కేంద్రం వెలుగు ఐకెపి కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు మండల స్థాయి జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి అధికారం చేపట్టాక రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలం రామచంద్రపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను వివరిస్తూ బాబుతో నేను కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చౌడయ్య, ఎలీషా బాబు, సిద్ధి సత్యం తదితరులు పాల్గొన్నారు. **పార్టీలో చేరిన వారికి అండగా ఉంటాం** : తమను నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక స్వగృహంలో గురువారం శిరివెళ్ల మండలం వనికిందిన్నే గ్రామానికి చెందిన రామసుబ్బయ్య, వారి అనుచర వర్గం సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో అఖిలప్రియ ఆధ్వర్యంలో చేరారు. ఈ కార్యక్రమంలో భార్గవరామ్, సిరివెళ్ల మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు. **గడివేముల** : బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం గురువారం నాడు గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఇంటింటికి తిరిగి టిడిపి ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోను వివరించి, బాబుతో నేను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై వైసిపి ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దం శ్రీనివాసులు, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, దుర్వేశి కృష్ణ యాదవ్, సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీదేవి, ఉండుట్ల గణేష్ రెడ్డి, పంట రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖిలప్రియ ఆధ్వర్యంలో టిడిపిలో చేరిక

గడివేముల : గడిగరేవులలో బాబు ష్యూరిటీలో గౌరు చరిత

నందికొట్కూరు : రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన నడుస్తోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడి టిడిపిని గెలిపించాలని టిడిపి నాయకులు కోరారు. టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ గౌరు వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నందికొట్కూరు పట్టణంలో మున్సిపాలిటీ 22 వార్డులో 75, 76వ బూత్ ఇంచార్జిలు బొల్లెద్దుల రాజన్న, నిమ్మకాయల రాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి టిడిపి మేనిఫెస్టోను వివరించి కరపత్రాలను అందజేశారు. పుష్పరాజ్, ప్రేమ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

19 నుండి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ ఆటల పోటీలు

- క్రీడా లోగోను ఆవిష్కరించిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ అటల పోటీలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్నాయి. ఆటల పోటీల క్రీడా లోగోను వైసిపి నాయకుడు మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ బి.శివకిరణ్, అయ్యప్ప రెడ్డి, నాగిరెడ్డి, టిడిపి నాయకులు రమేష్ రెడ్డి, ఎంఈవో శ్రీనాథ్, ప్రధానోపాధ్యాయుడు సాయి తిమ్మయ్య, కస్తూరిబా స్కూల్ ప్రిన్సిపాల్ ఉమా తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు మిడుతూరులో జరగడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బి శివ కిరణ్ మాట్లాడుతూ క్రీడలు స్నేహానికి వారధి లాంటివని అన్నారు. రమేష్ రెడ్డి మాట్లాడుతూ 26 జిల్లాల బాల బాలికలు మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం ఉంటుందన్నారు. సెక్రటరీ వి శివకుమార్ మాట్లాడుతూ ఇక్కడ ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్‌లో చత్తీస్‌ఘడ్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ నాగశేషులు, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సెక్రెటరీ సిద్ధార్థ, ఫేస్ బాల్ కోచ్ ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఎరువుల దుకాణదారులు నియమ నిబంధనలు పాటించాలని ఏవో కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని న్యూ పావన లక్ష్మి నరసింహ ఏజెన్సీస్ దుకాణాన్ని ఏవో గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, ఇన్వాయిస్‌లు, పిసిలు తనిఖీ చేసి అన్ని సరిగా ఉంచుకోవాలని ఆదేశించారు. నిషేధిత పురుగుల మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకూడదని హెచ్చరిం చారు. రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలన్నారు. అలాగే మండలంలోని అన్ని పురుగు మందులు ఎరువుల దుకాణాదారులు అన్ని రిజిస్టర్లు సరిగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఎవరైనా నియమనిబంధనలు పాటిం చకపోతే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

పట్టుదలతోనే విజయం సాధ్యం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టుదల క్రమశిక్షణతోనే విజయం సాధ్యమని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రామతీర్థం జిల్లా పరిషత్ పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ జిల్లా గద్వాల పట్టణానికి చెందిన విద్యా భారతి ఫౌండేషన్ ఛైర్మన్ సుబ్బరాజు సహకారంతో మొదటి బ్యాంకు 100 సూత్రాలు యండమూరి వీరేంద్రనాథ్ రచించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణి చేశారు. అనంతరం విద్యా విశిష్టతపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో బ్రహ్మానంద చారి మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతోనే విజయం సొంతం అవుతుందన్నారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యా విశిష్టత నైతిక విలువలు కష్టపడితే సాధించే విజయాలను వివరించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి హెచ్ఎం సురేంద్రబాబు, ఉపాధ్యాయులు రాజశేఖర్, బద్రి నారాయణ, వెంకటస్వామి, సురేంద్ర బాబు, నాగ పుల్లమ్మ, సుధాకర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి వంట పాత్రలు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానానికి గురువారం వంట పాత్రలను విరాళంగా ఒఇ పెద్దిరాజుకు అందజేశారు. దేవస్థానం నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలకు ఉపయోగించేందుకు వంట పాత్రలను బళ్లారికి చెందిన ఎర్రంగలిగి శ్రీ మల్లికార్జున భజన సంఘం అందజేసింది. ఈ వంట పాత్రల విలువ లక్ష రూపాయలు ఉంటుందని దాతలు తెలిపారు. విరాళం అందజేసిన దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్, సహాయ కార్య నిర్వహణ అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం ఉప సర్పంచికి చెక్ పవర్

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని రామాపురం గ్రామ ఉప సర్పంచ్ సువార్తమ్మకు గురువారం చెక్ పవర్ ఉత్తర్వులను ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి అందిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ చౌడమ్మ అనారోగ్య కారణాలవల్ల సెలవు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు పంపించడంతో ఉన్నతాధికారులు సర్పంచ్ చెక్కు పవర్‌ను రద్దుచేసి ఉపసర్పంచ్ సువార్తమ్మకు చెక్కు పవరును అందిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు.

నూతన గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు నర్ర తిరుపాలు నూతన గృహ ప్రవేశ వేడుకలల్లో ఎమ్మెల్యే ఆర్థర్ గురువారం పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు వైసిపి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, ఎల్ఐసి విశ్రాంత అధికారి మాధవరం యేసురత్నం, వేల్పుల సంజన్న, మాధవరం రత్నం, నర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి 'ఆ నలుగురు' అంత్యక్రియలు

పాడె మోస్తున్న ఆ నలుగురు సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - బేతంచర్ల

అనాథ శవానికి ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని గోర్లగుట్ట, గోవిందిన్నె గ్రామాల సమీపంలో, నారాయణ అనే సాధువు (60) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. గోర్లగుట్ట గ్రామ పరిసరాల్లో, ఒక చెట్టు కింద పడుకుని, సహజ మరణం చెందాడు. మృతునికి ఎవరూ లేనందువలన, గ్రామప్రజలు మృతుని అంత్యక్రియలు నిర్వహించమని ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాని కోరారు. వన్నూరు బాష బేతంచెర్ల పోలీసు వారికి, విఆర్ఒకి, సమాచారం ఇచ్చి ఆయన సభ్య బృందంతో, గ్రామ స్మశానంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, నాగేశ్వర రెడ్డి, లక్ష్మీరాఘవ, యూసుఫ్, మాబాష, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

15న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ

(5వ పేజీ తరువాయి...)

పాములపాడు : ఈ నెల 15న విజయవాడలో జరిగే రక్షణభేరి బహిరంగ సభను విజయ వంతం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు రామేశ్వరరావు, మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరరావు కోరారు. గురువారం పాములపాడులోని సిపిఎం కార్యాలయంలో ప్రజారక్షణభేరి వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్ఆర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవష్కరిస్తున్న నాయకులు

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రజలు, కార్మికులు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టనంలోని కోర్టు ఆవరణంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి న్యాయ సేవలు అందించాలనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు ఉచిత న్యాయ సేవా కార్యక్రమాలను నేడు ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి తేజ సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేశవరెడ్డి, ఏపిపి బాబు రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు మాణిక్యాలరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై, రాజ్యాంగ హక్కులు, విధులు, బాలికల రక్షణ గురించి వివరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు భయపడకుండా ధైర్యంగా కోర్టు ద్వారా, లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి కూలీల ఈ శ్రమ కార్డును గురించి అన్ని విషయాలను తెలియజేశారు. ప్రిన్సిపల్ షేక్షావలి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజం, చట్టాలు, న్యాయం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వన్నూరు వలి, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

ఉర్దూ భాషను సజీవంగా ఉంచుతాం

- ఘనంగా ఉర్దూ భాష దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల

ఉర్దూ భాషను సజీవంగా ఉంచుతామని వక్తలు తెలిపారు. కార్వానె ఉర్దూ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ డా.ముహమ్మద్ నౌమాన్ అధ్యక్షతన ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త అల్లమా ఇగ్బాల్ జయంతి 'ఉర్దూ దినోత్సవం'గా నిర్వహించారు. గురువారం వివేకానంద ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ మహబున్నిసా, ఏపి ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ షకూర్, కర్నూలు డైట్ కాలేజి ప్రిన్సిపల్ ఎన్.అయ్యూబ్ హుసేన్, జమాఆతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలాముల్లా, సర్వశిక్షా అభియాన్ సహాయ మానిటరింగ్ అధికారి యూనూస్ పలు కళాశాల, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఉర్దూ భాష ఆవశ్యకత, అభివృద్ధి వివరించారు. డా నౌమాన్ ప్రముఖులు చేతుల మీదుగా ఉర్దూ ఐకాన్, ఉర్దూ రతన్ అవార్డులు శాలువాలు కప్పి, మెమోంటోతో ప్రధానం చేసారు. కేజి ఖాజా హుసేన్‌కు ఉర్దూ ఐకాన్ అవార్డు, పలువురికి ఉర్దూ రతన్ అవార్డులను అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మెమోంటో ప్రశంసా పత్రం బహూకరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్ రూపొందించిన ఉర్దూ కవులు ఆల్బం, ప్రముఖ ఉర్దూ హాస్యకవి ఖఐసఇ రచించిన "సరీర్" ఉర్దూ పుస్తకం ఆవిష్కరించారు.

బహుమతులు అందచేస్తున్న దృశ్యం

నేడు జనసేన కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో శుక్రవారం జనసేన తాలూకా నాయకులు, కార్యకర్తల సమావేశం జరగనుంది. గత నాలుగు రోజుల క్రితం ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఆయన సోదరులు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వైసీపీని వీడి జనసేనలో చేరడం జరిగింది. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ తాలూకాలోని జనసేన నాయకులు, కార్యకర్తలతో కర్నూల్ జిల్లా జనసేన నాయకులు చింతల సురేష్ బాబు సమక్షంలో ఇరిగేల బ్రదర్స్ ఆత్మీయ భేటీ కానున్నారు. ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆధ్వర్యంలో తాలూకాలో జనసేన పార్టీ బలోపేతంతో పాటు పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు ముందుకు కొనసాగే విధంగా దశ, దిశ నిర్ణయించనున్నారు. జనసేన కార్యకర్తలతో సిరివెళ్ల నుంచి ఆళ్లగడ్డ వరకు భారీస్థాయిలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నారు. జనసేన కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం స్థానిక మహాలక్ష్మి కళ్యాణ మండపంలో జరిగే జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు.

జనసేన కార్యక్రమాలను విజయవంతం చేయండి

శుక్రవారం జరిగే జనసేన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తాలూకా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి, ఇరిగెల విశ్వనాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, జనసేన పార్టీ కార్యకర్తల సమావేశానికి తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా నాయకులు సురేష్ బాబు, తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, జనసేన పార్టీ తాలూకా నాయకులు మైలేరి మల్లయ్య హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల సుధాకర్ రెడ్డి, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - గడివేముల

ప్రజా అభివృద్ధి పథకాలకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం దుర్వేసి గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు నవరత్నాల బుక్లెట్ అందించి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండ్ల మమత, కృష్ణారెడ్డి, బండపల్లి రమేష్, పోతిరెడ్డి పరమేశ్వర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం

మండల పరిధిలోని దుర్వేసి గ్రామంలో రూ.80 లక్షల పైచిలుకు ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆర్‌బికె, గ్రామ సచివాలయం, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభో త్సవం చేశారు. ప్రజా అవసరాల కోసం అన్ని కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్ బీ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ మండ్ల మమత, మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రి : గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమవుతుందని శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నవంగలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచు మౌళిబాష, ఎంపిటీసి లక్ష్మిరెడ్డి , జేసిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ షేక్ బాబూలాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ రామగురివిరెడ్డి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీటీసి పత్తినారాయణ, వైసిపి నాయకులు రామక్రిష్ణారెడ్డి, రవిశంకర్ రెడ్డి, వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,పామిలేటి,బయన్న,తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

రోగులను పరీక్షిస్తున్న మున్సిపాలిటీ ఛైర్మన్ డాక్టర్ ఆసియా

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు : ఛైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

పేదలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఆత్మకూరు మున్సిపాలిటీ ఛైర్మన్ డాక్టర్ ఆసియా, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఛైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రోగులకు ఆమె ప్రత్యక్షంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం శిబిరంలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, కౌన్సిలర్ విజయ్ చౌదరి సుల్తాన్, మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ రాజగోపాల్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన వస్తువుల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా మిషన్, విశాఖపట్టణం తాజంగి, చింతపల్లి మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యుజియంలో గిరిజన ప్రాంతాలలో వున్న పురాతన వస్తువుల సేకరణ, డాక్యుమెంటేషన్ నిమిత్తం గ్రామస్థాయిలో పని చేసే ప్రాథమిక పాఠశాల (గిరిజన) అధ్యాపకులు, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, వెలుగు సిబ్బందికి గురువారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం సుండిపెంట ఐటిడిఎ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఐటిడిఎ పిఒ బి.రవీంద్ర రెడ్డి ప్రారంభించారు. పి.శంకర రావు, క్యురేటర్ భూషన్‌లు పురాత వస్తువుల సేకరణపై వివరించారు. ప్రాజెక్ట్ అధికారి సురేష్, సహాయ ప్రాజెక్ట్ అధికారి, కె.జి.నాయక్, పవన్ కుమార్‌చారి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నేత మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని జమ్మిరెడ్డి కాలనీకి చెందిన వైసిపి నాయకులు మెట్టుపల్లె శ్రీనివాసాచారి గుండె పోటుతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకొన్న వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి శ్రీనివాసాచారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ మెట్టుపల్లి ఆచారి తమ కుటుం బానికి ఎంతో సన్నిహితుడని ఆయన మృతి తీరని లోటు అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నివాళులర్పిస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

సిఐటియులో చేరిన అంగన్వాడీ టీచర్లు, ఆయాలు

ప్రజాశక్తి - డోన్

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు, ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి సమక్షంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఎఐటియుసి నుండి సిఐటియులో గురువారం డోన్ పట్టణంలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమా వేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, సిఐటియు పట్టణ కార్య దర్శి టి. శివరాం, పట్టణ, మండల అధ్యక్షులు నక్కిశ్రీకాంత్, పి.రామాంజనేయులు, కోశాధికారి నాగమద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిఐటియులో చేరిన వారికి సిఐటియు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం హక్కుల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం సిఐటియు సంఘమేనని అన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీలలో మెజార్టీ సంఘంగా సిఐటియు ఉన్నదని అంగన్వాడీ సెంటర్లలో గర్భిణీలు, బాలింతలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు కొరకు, వారి వేతనాల పెంపు కొరకు, ఉద్యోగ భద్రత కొరకు నిరంతరం సిఐటియు పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సులోచన,రహమద్ బి,సుమలత, శ్రీలత, సుభద్ర,శశికళ సుభాషిని,ఆయాలు సువర్ణ, ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, కుల్లయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను తెలియజేయాలి : వైసిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, ప్రజలు పొందుతున్న లబ్ధిని, గ్రామ అభివద్ధిని ప్రతి ఇంటికి తెలియజేయాలని ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమాన్ని గురువారం ఎంపిపి అధ్యక్షతన బండి ఆత్మకూరు సచివాలయం-1లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ పరిధిలోని బస్టాండ్ ఏరియాలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు దేశ వెంకట్రాంరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ ముడుమేల పుల్లారెడ్డి, పరమటూరు సహకార సంఘం అధ్యక్షులు శివలింగం, పిట్టం పెద్ద రామసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వర్ రెడ్డి, దేవస్థాన ఛైర్మన్ సుబ్బారెడ్డి, నాయకులు సీమ సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, చక్రపాణి, కోఆప్షన్ సభ్యుడు డి జమాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.



బండి ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీపీ డి చిన్న సంజీవరెడ్డి

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నందు ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబైలిజషన్ ఆఫీసర్ (సీఎంఒ) సెక్టోరల్ -01 పోస్టునకు డెప్యూటేషన్ ప్రాతిపదికన ఫారిన్ సర్వీస్ ఒమేగా డెల్టా కేజ్ నిబంధనలను అనుసరించి పనిచేయుటకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. అర్హులైన వారు 31-10-2023 నాటికి 50 సంవత్సరములలోపు వయస్సు కలిగిన, పాఠశాల సబ్జెక్టులు కలిగిన గాజీటెడ్ హెడ్ మాస్టర్స్ (గ్రేడ్-II) వారు నంద్యాల జిల్లా నందలి ప్రభుత్వ పాఠశాలలో/జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయు చున్నవారు, మండల విద్యాశాఖాధికారులు వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుండి 20 వ తేదీ సాయంత్రము 5 లోపు జిల్లా సమగ్ర శిక్ష, నంద్యాల కార్యాలయము నందు దరఖాస్తులను అందజేయాలని కోరారు. నంద్యాల జిల్లాలో పనిచేయుచున్న ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత వైసిపిదే

5వ పేజీ తరువాయి...

కార్యక్రమం మండల పరిషత్ అధ్యక్షురాలు మానసవీణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పట్టణంలోని గ్రామ సచివాలయం-1లో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైసిపి జెండాను వైసిపి మండల కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, జడ్పిటిసి సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, యాగంటి దేవస్థానం ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి ,వైసిపి నాయకులు అబ్దుల్ ఫైజ్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అత్తార్ జాహిద్ హుస్సేన్, సురేష్, ఈసారి ఎల్లయ్య చెర్లో కొత్తూరు చిన్నపురెడ్డి, బాలు, నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. అహోబిలం గ్రామ సచివాలయం నందు పల్లెకు పోదాంలో భాగంగా ఆర్థిక లబ్ది, ఆర్థిక కేతర లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రెసిడెంట్ కసెట్టి నాగేశ్వరరావు, జెసిఎస్ మండల కన్వీనర్ దుర్వేసుల రామకృష్ణ, మండల వైస్ ప్రెసిడెంట్ నాసారి ప్రసాద్, అహోబిలం సర్పంచ్ నాసారి వీరమ్మ, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **అవుకు :** మండలంలోని అన్నవరం గ్రామంలో ముఖ్యఅతిథిగా అవుకు మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పాల్గొని గ్రామంలో సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన వారి బోర్డును, వైయస్సార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, అవుకు మండల గ్రామ సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పార్థసారధి రెడ్డి, రామచంద్రారెడ్డి,బాలనాగిరెడ్డి, కాటసాని రాజేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి మహిళలు తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపజే యడంలో ఏ తారతమ్యము ఉండదని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో గ్రామ సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేయడం జరిగిందన్నారు. మండల కన్వీనర్ కుంచె తిరుమలేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, గూని నాగరాజు, గొరుమాన కొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, అంబాపురం నాయకులు పాపసాని చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి వెంకటేశ్వర్లు, సంగు రమణారెడ్డి, మాధవ స్వామి, మధు, ఎద్దులన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. గురువారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో పల్లెకి పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. మీ ఆశీర్వాదాలు జగనన్నకు ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక, ఇఒఆర్డి శ్రీనివాసులు నాయుడు, వేంపేట సర్పంచి మాణిక్యమ్మ, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ రామసుబ్బయ్య, ఎంపిటిసి బషీర్ అహద్, నాయకులు ఓబుల్ రెడ్డి, మధుసూదన్ రావు, స్వామిదాసు, రాజన్న తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** గ్రామీణ ప్రాంతాల పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, అర్హులైన ప్రజల వద్దకే పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైసిపి అని జెడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమలత, నాగంపల్లి సొసైటీ ఛైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని దుద్యాల గ్రామంలో గ్రామ సర్పంచి చందమాల శోభ లత అధ్యక్షతన 'పల్లెకు పోదాం-జగనన్న ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ మేరీ, మాజీ మండల వైస్ ఎంపిపి మహబూబ్ బాషా, జెసిఎస్ మండల కన్వీనర్ నాగలక్ష్మి రెడ్డి, మండల నాయకులు నారాయణరెడ్డి, రమేష్ బాబు రెడ్డి, రవీంద్రారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గ్రామీణ అభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరు చేస్తున్నారని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బండి ఆత్మకూరులో జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్ ముడిమల పుల్లారెడ్డి, వైసిపి కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి దేశువెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచి రాజారెడ్డి, సుజాతమ్మ మాట్లాడారు. అనంతరం మండల వ్యవసాయ సంఘం సలహా మండలి అధ్యక్షుడు కృష్ణ మల్లారెడ్డి ఇంటి వద్దకు వెళ్లి వాలంటీర్లకు పల్లెకు పోదాం కార్యక్రమం మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిన్న మద్దిలేటి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాగల వెంకటరమణ, పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి, బండి ఆత్మకూరు ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్, పరమటూరు సహకార సంఘం అధ్యక్షులు భూరం శివలింగం, ముంతల శేఖర్, సర్పంచి షేక్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు. **మిడుతూరు :** మండలంలోని చెరుకుచెర్ల గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, ఎంపిపి, సర్పంచి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్, సింగిల్ విండో ఛైర్మన్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, పీర్‌సావ్ పేట్ సొసైటీ ఛైర్మన్, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జెసిఎస్ కన్వీనర్ అబుబుకర్, వైసిపి పట్టణ అధ్యక్షులు మన్సూర్, కౌన్సిలర్ చిన్నరాజు, వైస్ ఛైర్మన్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ ఛైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ కిశోర్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రహత్ జబ్బర్, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ బేగ్, సీనియర్ నాయకులు బద్దుల శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి మార్కెట్ రాజు,కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. **ప్యాపిలి :** బోయినచెరువుపల్లి గ్రామ సచివాలయంలో వైసిపి మండల అధ్యక్షులు అధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న-ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బోర మల్లికార్జున రెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడారు. నాయకులు రామకృష్ణ, సర్పంచి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

పల్లెకు పోదాం పారంభిస్తున్న ఛైర్పర్సన్ మాబున్నీ సా మునిసిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి , అసిస్టెంట్ కమీషనర్ వెంకట దాస్ తదితరులు

పాములపాడు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

అవుకు : మాట్లాడుతున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

ప్యాపిలి: వైఎస్ఆర్సిపి జెండా ఆవిష్కరణ చేస్తున్న నేతలు

మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి